## క్లుప్తంగా

### ఏలేశ్వరం తహసీల్దార్‌గా వెంకటేశ్వరరావు



ఏలేశ్వరం: మండల తహసీల్దార్‌గా ఆర్‌వీ వెంకటేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా జీలుగుమిల్లి మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ వై.రంగారావు పశ్చిమ గోదావరి జిల్లా ముప్పవ మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

### రేపటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

తుని: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి 14 వరకూ పంచాయతీల నిర్వహణపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పంచాయతీల్లో పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద కేంద్రాలు, వీధి దీపాల నిర్వహణ, పంచాయతీల విధులు, బాధ్యతలు, పంచాయతీ రాజ్ చట్టం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా ఈ శిక్షణకు హాజరు కావాలని కోరారు.

### డ్రైన్లలో పూడిక తొలగింపు



జగపతినగరంలో పొక్లెయిన్‌తో డ్రైన్‌లో పూడిక తొలగిస్తున్న దృశ్యం

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం పంచాయతీలో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. వ్యర్థాలు, మురుగుతో డ్రైన్లు పూడుకుపోవడంతో నీరు ముందుకు పారడం లేదు. దీంతో సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది డ్రైన్లలో పూడిక తొలగింపు పనులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో చదరం చంటిబాబు, గుడాల రాంబాబు, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

### అమరజీవుల ఆశయ సాధనకు కృషి చేయాలి

కోటనందూరు: ఉపాధ్యాయుల ఉద్యమం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన అమలజీవుల ఆశయ సాధనకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు దాడి గోవిందరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎంఈఓ కార్యాలయ సమీపంలో శనివారం యూటీఎఫ్ 50 వసంతాల ఉత్సవం నిర్వహించారు. మండల సీనియర్, మహిళా, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొని యూటీఎఫ్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు.

### పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో పంచాయతీ సిబ్బంది శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని నీలాద్రిరావుపేట వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని యల్లమిల్లికి చెందిన మంగిన వీరబాబు, కొల్లి వెంకట్రావు యల్లమిల్లి నుంచి జగ్గంపేటకు ఆటోలో వెళుతున్నారు. నీలాద్రిరావుపేట ఆదిత్య హాస్పటల్ సమీపంలోకి వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న వీరబాబు, ప్రయాణికుడు వెంకట్రావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

# వర్షా కాలం.. వ్యాధుల గాలం

- అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా వర్షాలు
- ఇళ్ల మధ్య, రోడ్లపై నిలిచిపోతున్న నీరు
- అంటువ్యాధులు ప్రబలే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు



శరభవరం-పాదురుపాక రోడ్డు చెంతనే డంపింగ్ చేసిన వ్యర్థాలు

ప్రత్తిపాడు రూరల్: అల్పపీడనం ప్రభావంతో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో పాటు ఇళ్ల మధ్య, రోడ్లపై నీరు నిలిచిపోతోంది. ఫలితంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో అంటు వ్యాధులు, విష జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో వచ్చే మార్పులు, ఇంటి పరిసరాల్లో నిలిచే మురుగు నీరు కారణంగా పలు ప్రాంతాల్లో మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దీంతో పాటు కలుషిత తాగునీరు, ఆహారంతో డయోరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇటీవల కొద్ది రోజులుగా ఆస్పత్రుల్లో ఓపీ పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యపరంగా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

**వారికి మరింత ప్రమాదం**

కొద్దిరోజులుగా తెరిపివ్వకుండా వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు జోరందుకున్నాయి. సీజనల్‌గా వచ్చే జలుబు, జ్వరం, కళ్లనొప్పులు, దగ్గు వంటి వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారు. జలుబు, దగ్గు కొందరికి సీజనల్‌గా ఏటా వస్తుంటాయి. అలాంటి వారికి ప్రస్తుత వాతావరణంతో మరింత సులభంగా వ్యాధులు వస్తాయి. అంతేకాకుండా అస్తమా, డయాబెటిస్ వంటి వ్యాధులున్నా, స్టంట్ వేయించుకున్న వారిలో సహజంగానే ఇమ్యూనిటీ తక్కువగా ఉండి శ్వాస కోస వ్యాధులు, సీజనల్ ఫ్లూలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి వారు చల్లిటి వస్తువులు తీసుకోవడం, చల్లటి ప్రదేశాల్లో ఉండడం, వర్షాల్లో తడవడం వంటి వాటి వల్ల ఈ సమస్యలు రెట్టింపు అవుతాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ మందులు వాడితే రెండు వారాల వ్యవధిలోనే పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా...**

- కాచి చల్లార్చిన నీరు తాగాలి
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలి
- తినుబండరాలు, తాగునీటిపై మూతలు పట్టాలి.
- కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాల్లో నీటి నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.



ఉత్తరకంచిలో డ్రైన్‌గా మారిన పంట కాలువ

**పీహెచ్‌సీల్లో పెరుగుతున్న ఓపీ**

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో రాచపల్లి, పెద్దిపాలెం, శాంతిఆశ్రమం, ఏలేశ్వరం, శంఖవరం, పెదమల్లాపురం, ములగపూడి పీహెచ్‌సీలు ఉన్నాయి. ఈ పీహెచ్‌సీల్లో రోజుకు 200కి తగ్గకుండా ఓపీ నమోదు అవుతున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి సీహెచ్‌సీల్లో 300-400 వరకూ ఓపీ నమోదు అవుతోంది. రోజురోజుకూ జ్వర పీడుతుల సంఖ్య పెరుగుతోంది.

**ప్రధాన సమస్యగా డ్రైనేజీ వ్యవస్థ**

గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ ప్రధాన సమస్యగా ఉంది. ఏళ్లతరబడి అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చవలసి అవసరం ఎంతైనా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ అంతంత మాత్రంగా ఉండటంతో అత్యధిక గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మురుగు నీరు నిలిచిపోతోంది. ఫలితంగా దోమలు, పందులు స్వైర విహారం చేయడం వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**అప్రమత్తంగా ఉండాలి**



ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. సురక్షితమైన నీటిని మాత్రమే తాగాలి. వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చలిజ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ సౌమ్య, ఆర్ఎంఓ,
కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రత్తిపాడు

### ఆంధ్రా భద్రాద్రిలో నమూనా విగ్రహాల ఆవిష్కరణ



ప్రత్తిపాడు ఆంధ్రా భద్రాద్రి ఆలయంలో నమూనా విగ్రహాలను ఆవిష్కరించిన స్వామీజీలు

ప్రత్తిపాడు: స్థానిక నరేంద్రగిరిపై శ్రీరామనామ క్షేత్రం (ఆంధ్రా భద్రాద్రి ఆలయం)లో శనివారం సీతారామలక్ష్మణ నమూనా విగ్రహాలను ఆవిష్కరణ మహోత్సవం వైభవంగా జరిగింది. నరేంద్రగిరిపై నూతనంగా నిర్మిస్తున్న ఆంధ్రాభద్రాద్రి ఆలయంలో భద్రాచలంలోని స్వామివారి ఉత్సవ మూర్తులను పోలిన విగ్రహాలను వివిధ ఆశ్రమాల స్వామీజీల సమక్షంలో ఆవిష్కరించారు. అనంతరం శ్రీరామ నామక్షేత్రం ఆంధ్రా భద్రాద్రి నూతన ఆలయ నమూనా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీమద్ రామాయణ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి సుబ్బారావు, సూర్యానందస్వామి (లక్ష్మీనరసాపురం), రమానంద స్వామి (రాచపల్లి రమణాశ్రమం), ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోగుల వెంకటేశ్వరరావు, చెలంకూరి భాను, రెడ్నం రాజా, పత్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ మండల స్థాయి సమావేశం

కిర్లంపూడి: ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ నేతలు ముందుండాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు సూచించారు. కిర్లంపూడిలో శనివారం బీజేపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ విధివిధానాలపై చర్చించారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు తోట సర్వారాయుడు, చదరం చంటిబాబు, సింగిలిదేవి సత్తిరాజు, ఉలిసి ఐరాజు తదితరులు పాల్గొన్నారు.

# నిందితులపై చర్యలు తీసుకోవాలి



జగ్గంపేటలో కొవ్వత్తులతో నిరసన తెలుపుతున్న తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- స్మృతివనంపై దాడికి నిరసనగా కొవ్వత్తుల ర్యాలీ

జగ్గంపేట: విజయవాడలోని స్మృతివనంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం డిమాండ్ చేశారు. విజయవాడలో స్మృతివనంపై దాడికి నిరసనగా శనివారం రాత్రి జగ్గంపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారు ఎంతటివారైనా సహించేది లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో దాడులు పెరుగుతున్నాయన్నారు. స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

**విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి నిరసన**



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

అన్నవరం: విజయవాడలో భారతరత్న బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నించడంపై స్థానిక దళిత నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్, పంచాయతీ వార్డు మాజీ సభ్యుడు తాటిపాక కృష్ణ, న్యాయవాది బత్తుల రవికుమార్, నాయకులు తాటిపాక శ్రీను, తాడిపాక బాబి, నాగార్జున, తాడి సింహాచలం, కొత్తపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రత్నగిరికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం



తిరుచ్చి వాహనంపై సత్యదేవుని ప్రాకారసేవ

అన్నవరం: శ్రావణ మాసంలో శుద్ధషష్ఠిని పురస్కరించుకుని శనివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరిపై సత్యదేవుని ఆలయం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి ఆలయానికి తరలి వచ్చారు. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంతి మండపాలు అన్నీ భక్తులతో నిండిపోయాయి. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. వివాహాలు చేసుకున్న భక్తులు రత్నగిరిపై సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. సత్యదేవుని వ్రతాలు రెండువేలు జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో నాలుగు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

**ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ**

రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. అనంతరం వేద మంత్రాల మధ్య, పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో స్వామివారి ప్రాకారసేవ ప్రారంభించారు. మూడు సార్లు స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు ఊరేగింపుగా ప్రధానాలయానికి తీసుకువెళ్లారు. ఏఈఓ కృష్ణారావు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న సలాది కృష్ణ

ప్రత్తిపాడు: దాతల సాయాన్ని వృథా పోనివ్వరాదని, దాతలు ఆశించిన రీతిలో విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ అన్నారు. స్థానిక బజారు వీధి రామాలయం ఆవరణలో శనివారం సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ పోషకాహార కిట్లను, మధ్యాహ్న భోజనాన్ని స్థానిక శ్రీషిర్డీసాయి జ్యూలయరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి సమకూర్చారు. వీటిని విద్యార్థులకు సలాది కృష్ణ అందజేశారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల సంఘ నేత ఎం.భారతి, ఎస్ఎంఎస్ ప్రతినిధులు గొందేసి సత్యానందం, భేరి రాంబాబు, శిరసాల మణికంఠ జ్యోతి, కె.జగదీశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదకరంగా రహదారి



కోటనందూరులో పాత పీహెచ్‌సీ ఎదురుగా తవ్వేసిన తుని-నర్సీపట్నం రోడ్డు

కోటనందూరు: స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంతంలో పాత పీహెచ్‌సీకి ఎదురుగా తుని-నర్సీపట్నం రోడ్డును తవ్వేసి వదిలేశారు. దీంతో ఇక్కడ అనేకమంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందిగా మారుతుందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. పాత పీహెచ్‌సీ ఆవరణలో ఇటీవల మంచినీటి ట్యాంకును నిర్మించారు. ట్యాంకు నుంచి మంచినీటి గొట్టాలను రోడ్డు కిందభాగంలో అమర్చేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రోడ్డును తవ్వారు. గొట్టాలు అమర్చిన తరువాత తవ్విన రోడ్డును పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. రోడ్డు దుస్థితిని ఆర్అండ్‌బీ అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై వాహనచోదకులు మండి పడుతున్నారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

సామర్లకోట: రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని, దీనికి అందరూ సహకరించాలని శనివారం తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన వై శ్రీనివాసు ఏలూరుకు బదిలీపై వెళ్లారు. దీంతో ఏలూరు జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి చంద్రశేఖరరెడ్డిని కాకినాడ జిల్లాకు బదిలీ చేసి సామర్లకోట తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. దాంతో ఆయన శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే. శనివారం ఆయన విధులకు హాజరై సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసు, వీఆర్వోల సంఘ నాయకులు తహసీల్దార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎక్కువగా భూ సమస్యలు ఉంటాయని, తాను ఎక్కువ కాలం ల్యాండ్ సూపరింటెండెంట్‌గా పని చేయడంతో ఆ సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

# అత్తారింటికి వచ్చిన వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సామర్లకోట: అత్తారింటికి పిల్లలను చూడటానికి వచ్చిన వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన ఇది. ఎస్సై మూర్తి కథనం ప్రకారం వేట్లపాలెం శివారు జొన్నలదొడ్డిలో అత్తారింట్లో ఉంటున్న ఇద్దరు పిల్లలను చూడటానికి మోర్త సురేష్ శుక్రవారం రాత్రి వచ్చాడు. గొంచాలకు చెందిన సురేష్‌కు వేట్లపాలెం, జొన్నలదొడ్డికి చెందిన దీవెనతో వివాహమైంది. భార్య కువైట్‌లో ఉంటోంది. కువైట్‌లో ఉంటున్న భార్యకు శుక్రవారం రాత్రి ఫోన్ చేసి ఇంటికి వచ్చేయాలని డిమాండ్ చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్నట్టు స్థానికులు తెలిపారని ఎస్సై చెప్పారు. అదే విధంగా ఉదయం కూడా ఫోన్ చేసి భార్యతో గొడవ పడి నేను చనిపోతున్నానని చెప్పి సురేష్ బ్లేడ్‌తో పీక కోసుకున్నాడని ఎస్సై చెప్పారు. స్థానికులు వెంటనే సురేష్‌ను సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వచ్చారు. పరిస్థితి విషమించడంతో 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు వైద్యం చేయించుకోవడానికి సహకరించకపోవడంతో కౌన్సెలింగ్ చేసి సాయంత్రం వైద్యం ప్రారంభించినట్టు ఎస్సై తెలిపారు. క్షతగాత్రుని తండ్రి ప్రభాకరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై మూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



రౌతులపూడి సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు



ప్రత్తిపాడులో జెండా ఆవిష్కరించిన ఉపాధ్యాయులు

రౌతులపూడి: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద శనివారం స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కె.హరిబాబు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.రాంబాబు మాట్లాడుతూ 5000 మంది సభ్యులతో 1974లో అమలాపురంలో ఏర్పడిన యూటీఎఫ్ ప్రస్తుతం లక్షలాది మందితో అతిపెద్ద సంఘంగా ఏర్పడిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఎనలేని పోరాటాలు చేసిన ఘనత యూటీఎఫ్‌కు దక్కుతుందని జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు బి.తాతబాబు, ప్రధాన కార్యదర్శి అచ్చిరాజు, ఆర్‌వీఆర్ మూర్తి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు**

ప్రత్తిపాడు: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత హెచ్ఎం చెరుకూరి చిన సత్యనారాయణ, జంధ్యం అప్పలరాజు ముఖ్యఅతిథులుగా హాజరై యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ పోరాడిన తీరును వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీవీ రమణ, జిల్లా కుటుంబ సంక్షేమ పథకం డైరెక్టర్ రాపర్తి రామలింగేశ్వరరావు, సంఘ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**తొండంగి మండలంలో...**

తొండంగి: ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం స్వర్ణోత్సవాలు నిర్వహించారు. యూటీఎఫ్ నేతలు పతాకావిష్కరణ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ సాధించిన విజయాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుందరం, జిల్లా కార్యదర్శి టి.సత్తిబాబు, టీవీ రామకృష్ణ, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.